క్లుప్తంగా

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



విశేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు, నగలు, గంధం, పసుపు, నిమ్మ కాయలు, వేపాకులు, ప్రత్యేక పూలమాలలతో విశేష అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి తమ మొక్కుబడులను, ముడుపులను అమ్మవారికి చెల్లించుకున్నారు. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. భక్తులు బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. గంగమ్మ దేవాలయం సమీపంలోని వీరభద్ర స్వామి, వైద్యనాధీశ్వర ఆలయం, ఆంజనేయ స్వామి, సాయిబాబా దేవాలయాలలో భక్తులు పూజలు చేశారు.

రేపు లోక కల్యాణ మేళా

జమ్మలమడుగు : పట్టణ పరిధిలోని వ్యాపారులకు సీఎం స్వానిధి లోక కల్యాణ మేళా కార్యక్రమాన్ని మంగళారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె. వెంకట్రామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీధి వ్యాపారులు నమోదు చేసుకోవాలన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు కూడా మంజూరు చేయిస్తామన్నారు. వ్యాపారుల కుటుంబ సభ్యులకు ఉచిత మెడికల్ క్యాంపు, వ్యాపారుల వ్యక్తిగత సమాచారం, కుటుంబ సభ్యుల ప్రొఫైల్ వంటివి నమోదు చేస్తామన్నారు. వ్యాపారులు ఆధార్‌కార్డు జిరాక్స్, ఆధార్‌కార్డు లింక్ ఉన్న సెల్ నంబర్, రేషన్‌కార్డు తీసుకుని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే లోక కల్యాణ మేళా కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు.

దసరా ఉత్సవాలకు ఆహ్వానం



వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పీ రవీంద్రనాథరెడ్డికి ఆహ్వాన పత్రాన్ని అందచేస్తున్న ఆర్యవైశ్యులు

కమలాపురం : పట్టణంలో వెలసిన శ్రీ వాసవి కన్యక పరమేశ్వరీదేవి అమ్మవారిశాలలో ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి దసరా మహోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్యవైశ్య కమిటీ ప్రతినిధులు ఆదివారం వైస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, కమలాపురం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డిని కడప పట్టణంలోని ఆయన స్వ గృహంలో మర్యాద పూర్వకంగా కలిసి శ్రీదేవి శరన్నవ రాత్రి మహోత్సవ ఆహ్వాన పత్రికను అందించి ఉత్సవాలకు ఆహ్వానించారు.

ఉచిత వైద్య శిబిరాలు చేపట్టడం సంతోషకరం

వేంపల్లె : పేద ప్రజల కోసం మానవతా సంస్థ ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం సంతోషకరంగా ఉందని ప్రముఖ ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాల ఆవరణలో వేంపల్లె మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రోగులకు కీళ్ళు, ఎముకలు, నరాలకు సంబంధించి ఆర్థోపెడిక్ నిపుణులు వైద్య పరీక్షలు చేయగా, శ్రీవెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి మధురైకు (తిరుపతి శాఖ) వైద్య బృందం రోగులకు కంటి చూపుకు సంబంధించి వైద్య పరీక్షలు చేపట్టారు. ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపికైన రోగులకు తిరుపతికి ఉచితంగా రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సేవా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు యోగేశ్వరబాబు, వైద్య సిబ్బంది, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నీట మునిగిన నాపరాయి గనులు



వర్షం నీటితో నిండిన నాపరాయి పాలీష్ మీషన్లు

ఎర్రగుంట్ల : ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల మండలంలోని నాపరాయి గనులు, పాలీష్‌మీషన్లు నీట మునిగాయి. నిడుజివ్వి, కదిరివారిపల్లె గ్రామాల పరిధిలో ఉన్న గనులలో కొందరు యజమానులు జాగ్రత్త పడి గనుల్లో ఉన్న యంత్రాలను, వాహనాలు బయటకు తీసుకువచ్చారు. నాపరాయి కూలీలు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ఉన్న నాపరాయి పాలీష్‌మీషన్లలోకి నీరు వచ్చి చేరింది. దీంతో కొన్ని రోజులుగా నాపరాయి రాళ్ల ఎగుమతులు నిలిచి పోయాయి.

నేటి నుంచి దసరా ఉత్సవాలు



కమలాపురం : ఆలయం ఎదుట ప్రత్యేక అలంకరణలో భాగంగా వేసిన పందిరి

కమలాపురం : పట్టణంలోని అమ్మవారు శాలలో వెలసిన శ్రీ మత్కన్యకాపరమేశ్వరీ దేవీ శరన్నవరాత్రి మహోత్సావాలను ఈనెల 22వ తేదీ నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి వెంకటరమణయ్య, కోశాధికారి మాలేపాటి మల్లికార్జున తెలిపారు. 12 రోజుల పాటు జరిగే దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు మహిళలు, మహిళా మండలి సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. 22వ తేదీన అమ్మవారు దీక్షా బంధన అలంకారంలో దర్శనమిచ్చి భక్తులను కనువిందు చేస్తారన్నారు. 23న మధుర మీనాక్షిదేవి అలంకారంలో, 24న రాజరాజేశ్వరీదేవీ అలంకారం, 25న గజలక్ష్మీదేవి అంలకారం, 26న అన్నపూర్ణదేవి అలంకారం(తోటోత్సవం), 27న శ్రీలక్ష్మి వెంకటేశ్వరీ దేవి, 28న వారాహిదేవి, 29న సరస్వతిదేవి (బిందె సేవ) అలంకారం, 30న దుర్గా దేవి (మహిశాసురమర్ధిని) అలంకారంలో, సెప్టెంబర్ 1న ఐశ్వర్య లక్ష్మీదేవి అలంకారం, 2న విజయలక్ష్మీదేవి (గ్రామోత్సవం) అలంకారంలో దర్శనమిస్తారన్నారు. 3వ తేదీన పాన్పు సేవ (వసంతోత్సవం) అలంకారంలో కన్యకాపరమేశ్వరీదేవి దర్శనమిస్తారని, భక్తులు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు.

మహిళా మండలి ఆధ్వర్యంలో

పట్టణంలో వెలసిన అమ్మవారిశాలలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని ఆర్యవైశ్య వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో ప్రతి రోజు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మహిళా మండలి ప్రెసిడెంటు మాలేపాటి లక్ష్మీదేవి తెలిపారు. అలాగే ప్రతి రోజు రాత్రి 9గంటలకు లక్కీడిప్ ద్వారా బహుమతులు అందజేస్తామని ఆమె తెలిపారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని తలపనూరు గంగమ్మ ఆలయం, కీర్తిపల్లె నల్లనమ్మ ఆలయం, గడ్డంవారిపల్లె రాజరాజేశ్వరి ఆలయం, అనిమెల బోగాదమ్మ ఆలయం, సంగమేశ్వరాలయాల్లో సోమవారం నుంచి దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : నేటి నుంచి జరిగే దసరా ఉత్సవాలకు ఆలయాలను ముస్తాబు చేశారు. సోమవారం నుంచి దేవి నవరాత్రులు ప్రారంభం అవుతుండటంతో పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం వారు కన్యకా పరమేశ్వరిదేవి ఆలయప్రాంగణం, భావసార క్షత్రియులు అంబభవాని ఆలయాన్ని ముస్తాబు చేయగా , తొగటవీర క్షత్రీయుల కులదైవమైన చౌడేశ్వరిదేవి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. కన్యకాపరమేశ్వరి మొదటి రోజు భక్తులకు పార్వతిదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.



అలంకారంలో శ్రీ మత్కన్యకాపరమేశ్వరీ దేవి (ఫైల్)



జమ్మలమడుగులో ముస్తాబైన అంబాభవాని ఆలయం



అలంకారంలో అమ్మవారు (ఫైల్)

రైళ్లు ఆపక పోతే రైల్ రోకో చేస్తాం



రైల్వే స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి తదితరులు

కమలాపురం : స్థానిక రైల్వేస్టేషన్‌లో రైళ్లు ఆపకపోతే రైల్ రోకో చేయడం తథ్యం అని వైఎస్సార్ సీపీ నాయకులు హెచ్చరించారు. ఆదివారం హార్టికల్చర్ స్టేట్ ఎక్స్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కమలాపురం రైల్వే స్టేషన్‌లో అన్ని రైళ్లు ఆపాలి అని నినదించారు. స్టేషన్ మాస్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనాకు పూర్వం కమలాపురం రైల్వే స్టేషన్‌లో రాయలసీమ, హరిప్రియ, మెయిల్, తిరుమల గోవా, ఎగ్మోర్, కన్యా కుమారి తదితర ఎక్స్‌ప్రెస్‌లన్నింటికి స్టాపింగ్ ఉండేదన్నారు.

ఈ రైళ్లన్నింటిని కమలాపురంలో ఆపాలని గతంలో అప్పటి ఎమ్మెల్యేలు, ఎంపీల ఆధ్వర్యంలో రైల్ రోకో చేశామని గుర్తు చేశారు. వారిపై కేసులు నమోదు కావడం గుంతకల్లులోని వీఐపీ కోర్టులో ఇటీవల ఆ కేసులు కొట్టి వేయడం జరిగిందన్నారు. అయినప్పటికి కమలాపురం స్టేషన్‌లో రైళ్లు ఆపడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రైళ్లన్నింటికి స్టాపింగ్ సౌకర్యం కల్పించాలని లేని పక్షంలో రైల్ రోకో చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, చెన్నకేశవరెడ్డి, కొండారెడ్డి, మహ్మద్ సాదిక్, ఇర్ఫాన్, లక్ష్మీ నారాయణరెడ్డి, అంబటి సురేష్, దేవదానం, శ్రీరాం రమణ, జనార్ధన్ రెడ్డి, కుమార్‌రెడ్డి, విజయేంద్రారెడ్డి, మైసూరారెడ్డి, శివక్రిష్టారెడ్డి, సుబ్బన్న, సురేష్, జెట్టి నగేష్, మోనార్క్, జాఫర్, చంటి తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్య ప్రైవేటీకరణ ప్రమాదం

కమలాపురం : పీ–4 పేరుతో కూటమి ప్రభుత్వం వైద్య విద్య రంగాన్ని ప్రైవేట్ పరం చేస్తోందని, ఇది చాలా ప్రమాదకరమని, తక్షణం 590 జీఓను రద్దు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం కమలాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం 108 జీఓ ద్వారా 17 మెడికల్ కళాశాలలు, 5వేల సీట్లు, ఇందులో 70 శాతం సీట్లు ఫ్రీ, 30 శాతం సీట్లు పేమెంట్‌కు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం 590 జీఓ ద్వారా 9 మెడికల్ కళాశాలలను పీ–4 కింద ప్రైవేటీకరణ చేస్తోందని, ఇది అత్యంత దారుణమైన నిర్ణయం అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 590 జీఓ పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం చేయడమేనన్నారు. ప్రైవేటీకరణ చేస్తే డబ్బు ఉన్న వాడికే వైద్య విద్య అందుతుందన్నారు. బీహార్ లాంటి రాష్ట్రంలో పేపర్ లీకైన సంఘటనలు మనం చూశామని, గుజరాత్ లాంటి రాష్ట్రాల్లో సైతం ఇదే తంతు జరుగుతోందన్నారు. పీ–4 ద్వారా అనుమతి పొందిన ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం ప్రశ్న పత్రాలు సులభం లీక్ చేసుకుంటుందన్నారు. వైద్య శాఖలో 1.06లక్షల ఖాళీలు ఉన్న స్వయానా వైద్యశాఖ మంత్రే చెప్పారని, ఈ 17 మెడికల్ కళాశాలలను నిర్వహిస్తే 20 వేల ఉద్యోగాలైన భర్తీ చేయవచ్చని ఆయన తెలిపారు. వైద్య విద్య సామాన్యులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని లేని పక్షంలో కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించాలి



మాట్లాడుతున్న సైకాలజీ కౌన్సిలర్ ఎమిలిన్

వేంపల్లె : విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించడంతోపాటు ఆత్మహత్యలకు దూరంగా ఉండాలని సైకాలజీ కౌన్సిలర్ డాక్టర్ ఎమిలిన్ తెలిపారు. ఆదివారం ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్–14 ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి శారీరక, మానసిక సమస్యలు ఉంటాయని, ఎన్ని సమస్యలు ఉన్నప్పటికి డిప్రెషన్‌కు విద్యార్థులు లోను కాకూడదన్నారు. డిప్రెషన్‌కు గురైన వారు ఎవరితో కలవకపోవడంతోపాటు రాత్రి నిద్ర పోకుండా తిరగడం జరుగుతుందన్నారు. సమస్యలు ఉన్నప్పుడు స్నేహితులతో ఆ సమస్యలపై చర్చిస్తే పరిష్కారమవుతాయన్నారు. సమస్యలను షేర్ చేసినప్పుడు మనంలో మానసిక ఒత్తిడి అనేది తగ్గుతుందని, మనస్సులో ఉన్న సమయంలో సమస్యలను బయటికి వస్తే మనస్సులో ఉన్న ఒత్తిడి తగ్గుతుందన్నారు. మూడ్‌గా ఉన్న విద్యార్థులకు సంబంధించి వివరాలను అధికారులకు తోటి విద్యార్థులు సమాచారమిస్తే అలాంటి వారికి కౌన్సిలింగ్ ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆత్మహత్యలు చేసుకోవడంవలన తల్లిదండ్రులకు కడుపు కోత తప్ప.. ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. ఆత్మహత్యలవైపు విద్యార్థులు దృష్టి మళ్లించరాదని, మానసిక సమస్యలను అధిగమించి జీవితంలో విద్యార్థులు వృద్ధిలోకి రావాలన్నారు. అనంతరం వర్లల్ హైల్త్ ఆర్గనైజేషన్ సెప్టెంబర్ నెలను ఆత్మహత్య నివారణగా గుర్తిస్తారన్నారు. అనంతరం మానసిక సైకాలజి కౌన్సిలర్ డాక్టర్ ఎమిలిన్‌ను ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమార స్వామి గుప్తా సత్కరించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి డాక్టర్ పెనుగొండ రవికుమార్, ఎన్ఎస్ఎస్ యూనిట్–14 ప్రొగ్రాం ఆఫీసర్ డాక్టర్ తిరుపతిరెడ్డి, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టండి



పోలీస్‌స్టేషన్ సమీపంలో దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కమలాపురం : పట్టణంలోని క్రాస్ రోడ్డు ఆర్చి నుంచి రైల్వే గేటు వరకు ఉన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఏఐఎస్ఎఫ్ ఏరియా కార్యదర్శి షేక్ సాదిక్ ఆధ్వర్యంలో దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి మాట్లాడారు. రెండేళ్లుగా కమలాపురం క్రాస్ రోడ్డులోని ఆర్చి నుంచి రైల్వే గేటు వరకు అడుగడుగునా గుంతలు పడి రోడ్డు అధ్వానంగా తయారైందన్నారు. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న గుంతల్లో ద్విచక్ర వాహన చోదకులు పడి గాయపడిన సంఘటనలున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై గుంతలను పూడ్చి జరిగే ప్రమాదాలను నివారించాలన్నారు. లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల ఉపాధ్యక్షుడు మణికంఠరెడ్డి, సహాయ కార్యదర్శి రబ్బానీ, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబల్లె చెరువుకు చేరుతున్న వరద నీరు



నామాలగుండు వద్ద ప్రవహిస్తున్న వరద నీరు

పులివెందుల రూరల్ : మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఎర్రబల్లె చెరువుకు వరద నీరు వచ్చి చేరుతోంది. అనంతపురం, సత్యసాయి జిల్లా కదిరి, తలుపుల ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు కనంపల్లె, మోట్నూతలపల్లె మీదుగా ఎర్రబల్లె చెరువుకు చేరుతోంది. రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కనంపల్లె కొండల్లో నుంచి వస్తున్న జలపాతాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి.

ఘనంగా గురజాడ అప్పారావు జయంతి



వేంపల్లె : గురజాడ అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తదితరులు



జమ్మలమడుగు : గురజాడ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న కమిటీ సభ్యులు

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం ప్రిన్సిపాల్ నాగేంద్ర ఆధ్వర్యంలో ఆధునిక తెలుగు కవితా పితామహుడు గురజాడ అప్పారావు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : మహాకవి గురజాడ అప్పారావు అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు బండారు శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ప్రభుత్వ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి నాదెండ్ల బాబ్జి ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతులపై ఎరువుల భారం పెట్టడం బాధాకరం

వేంపల్లె : కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధరలను పెంచి రైతులపై ఎరువుల భారం పెట్టడం బాధాకరమని వైఎస్సార్‌సీపీ రైతు విభాగపు జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌రెడ్డి ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు. రసాయనిక ఎరువుల బస్తాపై రూ.50లు పెంచుతుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉందన్నారు. రాష్ట్రంలో రబీ సీజన్ మొదలై వర్షాలు పడుతుంటే పంట సమయానికి రైతులపై మళ్లీ ఎరువుల రేట్లు పెంచడం దారుణమన్నారు. పీఎం కిసాన్ డబ్బుల కోసం ప్రధాని ఇలా ప్రతిసారి ఎరువుల ధరలను పెంచడం దారుణమన్నారు. రైతులు అప్పుల ఊబిలోకి కూరుకు పోతున్నారని, సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రులతో చర్చించి రసాయనిక ఎరువుల ధరలను తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

కట్టు కొమ్మ కాలువ.. కళ కళ



వల వేసి చేపలు పడుతున్న సి.గోపులాపురం యువత

కమలాపురం : పాపాఘ్ని నది నుంచి కమలాపురం చెరువుకు వరద నీరు ప్రవహించే కట్టుకొమ్మ కాలువ కళ కళ లాడుతోంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాపాఘ్ని నదికి వరద నీరు వచ్చి చేరింది. దీంతో ఆ నీరు కట్టు కొమ్మ కాలువ గుండా కమలాపురం చెరువుకు ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో మండలంలోని టి.చదిపిరాళ్ల, సి.గోపులాపురం గ్రామాల మధ్య ఈ కాలువ ప్రవహిస్తుండటంతో దసరా సెలవులు రావడం, ఆదివారం కావడంతో సి.గోపులాపురం గ్రామానికి చెందిన పిల్లలు, పెద్దలు అక్కడికి చేకున్నారు. కొందరు ఈత కొడుతుంటే మరి కొందరు చేపలు పడుతున్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ఎర్రగుంట్ల : మండలంలోని చిలంకూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో స్వస్థ నారి స్వసక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య వైద్య శిబిరంను నిర్వహించినట్లు వైద్యాధికారి డాక్టర్ సాయిచరితారెడ్డి తెలిపారు. వైద్యులు రోగులకు వైద్య సేవలు అందించారు. షుగర్, బీపీ, క్యాన్సర్, పరీక్షలు నిర్వహించారు. కౌమర బాలికలకు రక్తహీనత పరీక్షలు, గర్భిణులకు పరీక్షలు, వ్యాధినిరోధక టీకాలు, వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన



అవగాహన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ, తదితరులు

తొండూరు : మండలంలోని సంతకొవ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్లు ప్రజలకు వివిధ రకాల వ్యాధులపై అవగాహన కల్పించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ ఖాజా మొహిద్దీన్ పర్యవేక్షించి మాట్లాడారు. కంటి, దంత తదితర వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. అలాగే డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ప్రసన్నలత కిశోర బాలికలకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేసి సారెతో సత్కరించి పౌష్టికాహారం అందజేశారు. అనంతరం వారు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్యులు వై.సారికారెడ్డి, బీఎస్ నాయక్, ఆప్తాల్మిక్ ఆఫీసర్ లక్ష్మీదేవి, ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య, హెల్త్ సూపర్‌వైజర్ రాధా రుక్మిణి, ఆరోగ్య విస్తరణాధికారి డాక్టర్ సుబ్రమణ్యం, అంగన్‌వాడీ కార్యకర్తలు, సర్పంచ్ ఓబులేసు, జెడ్పీటీసీ బండి లక్ష్మీనారాయణమ్మ, మార్కెట్ యార్డు చైర్మన్ బండి రామసూరారెడ్డి, సీహెచ్‌ఓలు, పీహెచ్‌సీ సిబ్బంది, ఆరోగ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కుళ్లిన ఉల్లి.. పొలాల్లోనే వదలి...



సిర్రాజుపల్లిలో కుళ్లిన పంటను పరిశీలిస్తున్న రైతులు



ముద్దనూరు : తడిసిన ఉల్లిని ఆరబెట్టిన రైతు

ఎర్రగుంట్ల : ఎంతో ఆశతో సాగు చేసిన ఉల్లి పంట దెబ్బతిని కుళ్లి పోయింది. కుళ్లిపోయిన ఉల్లి పంటను పోలంలోనే వదిలివేశామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సిర్రాజుపల్లె గ్రామపంచాయతీలో దండుపల్లి, కర్చుకుంటపల్లి, రంగసాయిపురం గ్రామాలలో కలిపి సుమారు 350 ఎకరాల ఉల్లి పంటను సాగు చేశారు. ప్రస్తుతం ఉల్లి పంట కొత దశలో ఉంది. అయితే ఏడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో ఉల్లి గడ్డలు కుళ్లిపోయాయి. పంట చేతికి వస్తుందన్న ఆశతో ఎకరాకు సుమారు రూ.70 వేలు ఖర్చు చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : మూడు రోజులుగా మండలంలో కురిసినవర్షం వల్ల ఉల్లిపంటకు నష్టంవాటిల్లుతోంది. కొన్నిచోట్ల చేతికొచ్చిన పంట తడిసిపోయి దెబ్బతినింది. మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన గుర్రప్ప అనే రైతు సాగుచేసిన ఉల్లి చేతికొచ్చిన సమయానికి వర్షంతో దెబ్బతినడంతో ఉల్లిపాయలను ఆరబెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాణ్యత సరిగాలేదని తక్కువ ధరకే ఉల్లిని వ్యాపారులు కొనుగోలుచేస్తున్నారని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

పొలంలోనే పంట కుళ్లిపోయింది



ఎంతో ఆశతో ఉల్లి పంటను 8 ఎకరాలలో సాగు చేశాను. ఎరువులు, మందులు కూలీల ఖర్చు, సాగు ఖర్చులు కలిపి ఎకరాకు రూ.70 వేలు అయింది. వర్షాలు కారణంగా పంట పూర్తి పొలంలోనే దెబ్బతిని కుళ్లి పోయింది. ప్రభుత్వాలు ఇన్సూరెన్స్ ఇచ్చి ఆదుకోవాలి.

– జగన్‌మోహన్‌రెడ్డి, సిర్రాజులపల్లి.

ఉల్లి పంటను చూసి కన్నీళ్లు ఆగలేదు



సాగు చేసిన ఉల్లి పంటను చూసి కన్నీళ్లు ఆగలేదు. నేను 5 ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశాను. ఎకరాకు దాదాపు రూ.70 వేలు ఖర్చు అయింది. ఇలా ఐదెకరాలకు రూ.3.50 లక్షలు ఖర్చు పెట్టాను. మొత్తం పంటను కొయడానికి 40 మంది కూలీలు అవసరం. వారికి డబ్బులు కూడా ఇవ్వలేని పరిస్థితి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకుని నష్టపరిహారం అందించాలి.

– చిద్విలాసరెడ్డి, సిర్రాజుపల్లి.